పారదర్శకంగా సంక్షేమ పథకాల వర్తింపు

• ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి



'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి, పైలా నరసింహయ్య

పుట్లూరు: పార్టీలు, వర్గాలకు, కులమతాలు చూడకుండా అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందని ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని నాయకునిపల్లి సమీపంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో సంక్షేమ పథకాలు అమలు కొనసాగాలంటే జగనన్నను మరో మారు ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో తన 3,648 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్ర ద్వారా అన్ని వర్గాల ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా చూసిన జగనన్న నవరత్నాలతో పాటు అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు కార్యక్రమం ద్వారా అభివృద్ధి చేయడంతో పాటు గతంలో ఎన్నడూ లేని సౌకర్యాలను ప్రభుత్వ పాఠశాలలో కల్పించి, పేద విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాట వేస్తున్నారన్నారు. వైద్య సేవలను గ్రామ స్థాయికి తీసుకురావడంతో పాటు 108, 104 సేవలు, పాడి రైతులకు అండగా ఆంబులెన్స్‌లను అందుబాటులోకి తెచ్చారన్నారు.

'మా నమ్మకం నువ్వే జగన్' నినాదం చేరాలి : 'మా నమ్మకం నువ్వే జగన్' అనే నినాదం ప్రతి గడపకూ చేరాలని ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడంలో వలంటీర్ల పాత్ర గొప్పదన్నారు. చంద్రబాబునాయుడు తాను అధికారంలో ఉన్న సమయంలో బీసీలను కేవలం ఓటు బ్యాంక్‌గా చూశారని విమర్శించారు. ప్రస్తుతం బీసీలు అంటే బ్యాక్ వర్డ్ కాకుండా బ్యాక్ బోన్ అని జగనన్న నిరూపించారన్నారు. సీఎం జగనన్న అంటే ఓ నమ్మకమని, మళ్లీ ఆయనను ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి సమష్టిగా కృషి చేయాలన్నారు. అనంతరం 'మా నమ్మకం నువ్వే జగన్' అనే స్టిక్కర్లు, లోగోలను ఆవిష్కరించారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిద్దాం

త్వరలో జరగనున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎన్నికల్లో ఎమ్మెల్సీఅభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగేశ్వరరావు, సర్పంచ్‌లు రామకృష్ణారెడ్డి, మహేశ్వరరెడ్డి, ఓబుళేసు, నాయకులు కందికాపుల శ్రీధర్ రెడ్డి, మడుగుపల్లి గోపాల్‌రెడ్డి, కేశవనాయుడు, రామమోహన్, పోలిరెడ్డి, నరేంద్ర, నాగముని, రమణారెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఐక్యతగా ఉరుసు నిర్వహించుకోండి

• ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



ఉరుసు పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

శింగనమల: శింగనమలలో మసూద్‌గాజీ దర్గా ఉరుసు మహోత్సవం హిందూ–ముస్లింల ఐక్యతగా నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉరుసు మహోత్సవం పోస్టర్లను విడుదల చేశారు. ఈనెల 18 నుంచి 20 వరకు ఉరుసు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ మెంబర్ ఆలీ, దర్గా ముజావర్లు అబ్దుల్, అక్రమ్, రజాక్ , వైఎస్సార్‌సీపీ నాయకులు శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

గుత్తి: పట్టణంలోని గాజుల బావి, బెస్తగేరి, బండగేరి కాలనీల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఏసీడీపీఓ డిల్లీశ్వరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె కేంద్రాల్లోని అన్ని రకాల రికార్డులు పరిశీలించారు. పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేస్తున్నారా ? లేదా అనే విషయాలపై ఆరా తీశారు. సకాలంలో కేంద్రాలు తెరవాలని, సమయపాలన పాటించాలని, ఎలాంటి అవకతవకలకు తావు ఇవ్వొద్దని అంగన్‌వాడీ కార్యకర్తలను ఆదేశించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రియాంక పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట జరిగి 22 ఏళ్లయిన సందర్భంగా శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవారికి ఆలయ అర్చకులు పంచామృత అభిషేకాలు, ఆలయంలో హోమాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు భాస్కర్ రంగయ్య, ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి, కార్యదర్శి నారాయణస్వామి, కోశాధికారి సుధాకర్‌గుప్త, జయంతి వెంకట్ సభ్యులు ప్రవీణ్, రమేష్, సుదర్శనబాబు, వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

చెట్లు నరికిన వ్యక్తిపై చర్యలు తీసుకోండి

యాడికి: అనుమతిలేకుండా నాలుగు చింత చెట్లు, రెండు వేపచెట్లు నరికిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని తూట్రాళ్లపల్లె పంచాయతీ కార్యదర్శి వసుంధర, వీఆర్వో సత్యం శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్యదర్శి వసుంధర మాట్లాడుతూ కొత్తపల్లె సమీపంలోని సర్వే నంబర్ 340లో ఉన్న చింత, వేపచెట్లను టీడీపీ నాయకుడు దేవేంద్ర నాయుడు నరికివేసి, ట్రాక్టర్‌లో తరలిస్తుండగా వీఆర్వో సత్యం, వీఆర్‌ఏ రామకృష్ణతో కలిసి పట్టుకున్నామన్నారు. చెట్లు కొట్టేసిన దేవేంద్రనాయుడుపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి

గుంతకల్లుటౌన్: జగనన్న గోరుముద్ద మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనాలను వడ్డించాలని గుంతకల్లు ఆర్డీఓ రవీంద్ర, మున్సిపల్ కమిషనర్ బండిశేషన్న తెలిపారు. శుక్రవారం పట్టణంలోని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని వారు పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనాలు వడ్డిస్తున్నారా? లేదా అని వారు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

గుంతకల్లు రూరల్: విద్యార్థులు పోటీతత్వానికి అనుగుణంగా తమ కేరీర్‌ను మలచుకోవాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు కేఎల్ఎస్ ప్రసాద్ పేర్కొన్నారు. అనంతపురం నెహ్రూ యువ కేంద్రం, రాధా మహిళా మండలి, శ్రీశంకరానందగిరి డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీశంకరానంద డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ పీ.గోపాల్ అధ్యక్షతన కెరియర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కళ్యాణదుర్గం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు కేఎల్ఎస్ ప్రసాద్ కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యక్తిత్వ వికాసంపై యువజన సర్వీసుల శాఖ రూపొందించిన పుస్తకాన్ని అవిష్కరించారు. అధ్యాపకులకు మొక్కలను పంపిణీ చేశారు.

జగనన్న గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



కల్లూరులోలో సంక్షేమ పథకాల లబ్ధిని తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

యల్లనూరు: వచ్చే ఎన్నికల్లో జగనన్న గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. శుక్రవారం మండలంలోని కల్లూరు గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హాజరయ్యారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ, సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. కల్లూరు గ్రామానికి బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు సాంబశివారెడ్డి, ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వారంలోపు గ్రామానికి బస్సు సౌకర్యాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చారు. కల్లూరు– తిమ్మంపల్లి, , దంతలపల్లి– కల్లూరు, గడ్డంవారిపల్లి– యల్లనూరు చెరువుమీద గరుగుల్లో మట్టి , తారురోడ్డు సౌకర్యం కల్పించాలని వైఎస్సార్ సీపీ నాయకులు సూరి, జగన్మోహన్ నాయుడులు సాంబశివారెడ్డిని అడిగారు. వెంటనే ఆర్‌అండ్‌బీ డీఈఓ ఫోన్లో మాట్లాడి, తక్షణమే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు భోగాతి విజయప్రతాప్‌రెడ్డి, పంపీపీ గంగాదేవి, సీఐ చిన్నపెద్దయ్య, ఎస్ఐ రామకృష్ణ, కోఆప్షన్ మెంబరు బషీర్, సర్పంచులు రామాంజులరెడ్డి, నాగేంద్ర , వైఎస్సార్ సీపీ నాయకులు ఈశ్వరరెడ్డి, కల్లూరు ప్రతాప్‌రెడ్డి, సూరి, జగన్‌మోహన్ నాయుడు, రఘునాథరెడ్డి, యల్లాల శ్రీనివాసులు ,రాజు, పాల్గొన్నారు.

ఘనంగా శతాబ్ది ఉత్సవాల నిర్వహణ

• టౌన్ బ్యాంకు అధ్యక్షుడు అబ్దుల్ జిలాన్



మాట్లాడుతున్న టౌన్ బ్యాంకు అధ్యక్షుడు అబ్దుల్

గుత్తి: గుత్తిలో టౌన్ బ్యాంకు శతాబ్ది ఉత్సవాలు 12న ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామని గుత్తి టౌన్ బ్యాంకు అధ్యక్షుడు అబ్దుల్ జిలాన్, బ్యాంకు సీఈఓ మహేశ్వర ప్రసాద్ తెలిపారు. గుత్తి ఆర్ఎస్‌లోని టౌన్ బ్యాంకు బ్రాంచ్ కార్యాలయంలో శుక్రవారం వారు డైరెక్టర్లతో కలిసి విలేకరులతో మాట్లడారు. టౌన్ బ్యాంకు నష్టాలతో ప్రారంభమై అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రస్తుతం రూ. 2 కోట్లు 50 లక్షల లాభాల్లో ఉందన్నారు. ప్రస్తుతం బ్యాంకులో రూ. 99 కోట్ల డిపాజిట్లు ఉన్నాయన్నారు. రూ. 81 కోట్ల రుణాలు ఇచ్చామన్నారు. ఖాతాదారులు 5,366 మంది ఉన్నారన్నారు. ఖాతాదారులు, షేర్ హోల్డర్లకు డివిడెంట్ 8 శాతం ఇచ్చామన్నారు. ఖాతాదారులు, ప్రజలు, బ్యాంకు అధికారులు, బ్యాంకు పాలక వర్గం, బ్యాంకు సిబ్బంది కృషి, కష్టం ఫలితంగా బ్యాంకు అంచెలంచెలుగా ఎదిగి అభివృద్ధి చెందడంతో పాటు లాభాల బాట పట్టిందన్నారు. ఈ నెల 12న జరగనున్న శతాబ్ది ఉత్సవాల్లో ఖాతాదారులు, పాలక వర్గం, బ్యాంకు అధికారులను సన్మానించనున్నామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు ఉపాధ్యక్షుడు కృష్ణ, డైరెక్టర్లు నాగరాజు (అంగడి), వెంకటేష్ (వెంకి), స్టోర్ నాగరాజు, ఈరన్న, మధు సూదన్ గుప్తా, మాబు, వెంకటేష్ (బాబు) , బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో సేవలను సద్వినియోగం చేసుకోవాలి

• డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి



వైద్యులు, సిబ్బందిని అభినందిస్తున్న డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి

శింగనమల: స్థానిక కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి అన్నారు. శింగనమల సీహెచ్‌సీలో మూడు నెలలోనే వంద కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసిన వైద్యులు డాక్టర్ రమణనాయక్, వైద్య సిబ్బందిని శనివారం అభినందించారు. అనంతరం శ్రీరామిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. సీహెచ్‌సీలో రూ.2 కోట్లతో అదనపు భవనాలు నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. సీహెచ్‌సీని మరింత అభివృద్ధికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి కృషి చేస్తున్నారన్నారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రమణనాయక్ మాట్లాడుతూ ప్రతి వారం 10 మంది దాకా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కసాపురంలో పలు పనులకు టెండర్లు



వేలం పాట నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఏడాది పాటు నిర్వహించనున్న వివిధ రకాల పనులకు ఆలయంలో శుక్రవారం టెండర్లు నిర్వహించారు. ఆలయ ఈవో డీ వెంకటేశ్వరరెడ్డి, ఏఈవో ధనుంజయ, ఆలయ అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ ఆధ్వర్యంలో ఈ– టెండర్, సీల్డ్ టెండర్‌తోపాటు శుక్రవారం ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహించారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకూ ఏడాదికాలం పాటు ఆలయంలో భక్తులు స్వామికి సమర్పించనున్న తలనీలాల సేకరణ, కిరాణా సరుకుల సరఫరా, కొబ్బరి చిప్పల సేకరణ, వాహనాల పార్కింగ్, బెడ్‌షీట్స్, మ్యాట్స్ అద్దె ప్రాతిపదికన భక్తులకు సరఫరా చేయాల్సి ఉంటుంది. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఏర్పాటు, శానిటేషన్, హౌస్ కీపింగ్, క్లోక్ రూము నిర్వహణ, ఆకుపూజల కోసం తమలపాకుల సరఫరా, భక్తులు సమర్పించిన బియ్యం బేడల సేకరణ, స్టేషనరీ సప్లై తదితర పనుల నిర్వహించాల్సి ఉంటుంది. టెండర్లను ఆలయ అధికారులు గత ఏడాది కంటే 30 శాతం అధికంగా పెంచారన్న కారణంతో టెండరు దారులు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో బియ్యంబేడలు టెండర్ మినహా మిగిలిన అన్ని టెండర్లు వాయిదా పడ్డాయి. డోన్‌కు చెందిన కన్యకాపరమేశ్వరి మోడరన్ రైల్ మిల్ వారు కిలో రూ.16.50 చొప్పున బియ్యం,బేడలు టెండర్‌ను దక్కించుకున్నట్లు ఆలయ ఏఈవో ధనుంజయ తెలిపారు. మిగిలిన అన్ని టెండర్లను త్వరలోనే నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

పేదల ఇళ్లలో పెద్ద కొడుకు వైఎస్ జగన్

• వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



వైఎస్సార్ కళ్యాణమస్తు,షాదీతోఫా నగదు జమచేయడంపై హర్షం వ్యక్తంచేస్తున్న మహిళలు

పుట్లూరు: వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా పథకాల ద్వారా అర్హులైన 4,536 మంది లబ్దిదారులకు రూ.38.18 కోట్లు అందించి పేదల ఇళ్లలో పెద్ద కొడుకులా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని నాయకునిపల్లి వద్ద విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎలాంటి సిఫార్సులు లేకుండా అర్హతే ప్రామాణికంగా పార్టీలకు, కులాలకు, వర్గాలకు అతీతంగా పథకాలు అందిస్తున్న ఘనత జగనన్నకు దక్కుతుందన్నారు. వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా పథకాల ద్వారా బటన్ నొక్కి పెళ్లి కుమార్తెల ఖాతాల్లోకి నగదు జమ చేసిన జగనన్నకు ధన్యవాదాలు తెలిపారు. ఈ పథకాల ద్వారా కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా విద్యను ప్రోత్సహించడంతో పాటు బాల్య వివాహాలను అరికడుతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న జగనన్నకు మద్దతు తెలుపుతూ మరో మారు ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా పథకాల ద్వారా లబ్ధిదారులకు లబ్ధి చేకూర్చడంపై హర్షం వ్యక్తం చేస్తూ 'మా నమ్మకం నువ్వే జగన్' అని పలువురు మహిళలతో కలిసి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పుట్లూరు ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి, పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మహిళా కూలీకి తీవ్ర గాయాలు

యాడికి: మండలంలో చందనలో వ్యవసాయ కూలీ పూర్ణకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. గ్రామానికి చెందిన పూర్ణ వ్యవసాయ పనులు చేస్తుండగా పార కాలికి తగిలి తీవ్రంగా గాయపడింది. తోటి కూలీలు ఆమెను రాయలచెరువు పీహెచ్‌సీకి, అక్కడి నుంచి అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

ఇళ్ల వద్దే బియ్యం పంపిణీ చేయండి

యాడికి: రేషన్ బియ్యాన్ని ఎండీయూ వాహనం ద్వారానే ఇళ్ల వద్దనే పంపిణీ చేయాలని ఎండీయూ వాహన ఆపరేటర్‌కు సీఎస్‌డీటీ సూర్యనారాయణ సూచించారు. శుక్రవారం చందనలో రేషన్ పంపిణీని సీఎస్‌డీటీ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుంతకల్లు: గుత్తిలోని 220 కేవీ సబ్ సేష్టన్‌లో మరమ్మతులు కారణంగా గుంతకల్లు టౌన్‌తోపాటు మండలంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ ఏ రంగస్వామి శుక్రవారం తెలిపారు.

ఎంపీడీవోగా కొండన్న నియామకం

యల్లనూరు: మండల ప్రజా పరిషత్ అధికారిగా కొండన్న సోమవారం నూతన బాధ్యతలు తీసుకుంటున్నట్లు ఏఓ రామచంద్రారెడ్డి తెలిపారు.

రేపు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు

తాడిపత్రి టౌన్: స్థానిక యల్లనూరు రోడ్డు సర్కిల్ సమీపంలోని వరదయ్య కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం సాయంత్రం 4 గంటలకు టెన్త్, ఇంటర్, డిగ్రీ , ఇంజనీరింగ్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు బహుత్తమ పద్మశాలీయ సంఘ అధ్యక్షుడు గద్దం గణేష్ తెలిపారు.

గడ్డి వాములు దగ్ధం

గుత్తి రూరల్: మండలంలోని అబ్బేదొడ్డిలో రైతు తిమ్మారెడ్డికి చెందిన వరి గడ్డి, వేరుశనగ పొట్టు వాములు కాలిపోయాయి. తిమ్మారెడ్డి పశువులకు మేత కోసం వరి గడ్డి, వేరుశనగ పొట్టు కొనుగోలు చేసి పొలంలో వాములు వేశాడు. శుక్రవారం ప్రమాదవశాత్తు వాములకు నిప్పంటుకుంది. గుంతకల్లు నుంచి అగ్నిమాపక వాహనం వచ్చి మంటలు ఆర్పేలోపు వాములు కాలిపోయాయి. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బుక్కరాయసముద్రం: సిద్దరాంపురంలో ఆదినారాయణ అనే రైతుకు చెందిన గడ్డివామి దగ్ధమైంది. ఆదినారాయణ పశువుల మేతకోసం ఐదు ట్రాక్టర్ల వరిగడ్డి వామి వేసుకున్నాడు. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో కాలిపోయింది.

కామ్రేడ్ ప్రసాద్ వర్ధంతి రేపు

గార్లదిన్నె: కామ్రేడ్ ప్రసాద్ వర్ధంతి వేడుకలు ఆదివారం నిర్వహిస్తున్నట్లు అఖిల భారత యువజన సమైక్య జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనాథ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కామ్రేడ్ ప్రసాద్ 4వ వర్ధంతిని కొట్టాలపల్లిలో నిర్వహిస్తున్నామన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

గుత్తి: కర్నూల్ జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరికి చెందిన రాణి అనే వివాహిత శుక్రవారం ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. రాణి భర్తతో చిన్న పాటి విషయంపై గొడవ పడింది. మనస్తాపం చెందిన రాణి..ఇంటి వద్దనే పురుగులు మందు తాగింది. అపస్మారక స్థితిలో ఉండగా కుటుంబ సభ్యులు ఆమెను గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం సర్వజనాస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై జొన్నగిరి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ప్రైవేట్ కళాశాలల బంద్ విజయవంతం

గుంతకల్లుటౌన్: విద్యార్థులను ఫీజుల కోసం వేధిస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ డిమాండ్ చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతం అయ్యింది. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకీ, కిశోర్, చందూ, జాకీర్, బాష తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

యాడికి: పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. రూ.7,200 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

టిప్పర్, ఆటో సీజ్

యాడికి: యాడికి రాయలచెరువు రహదారిలో అధిక టన్నేజీతో వెళ్తున్న టిప్పర్, ఆటోను సీజ్ చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ ట్రాక్టర్లు, టిప్పర్లు అధిక టన్నేజీతో మితిమీరిన వేగంతో తిరుగుతున్నాయన్నారు. స్థానికులనుంచి ఫిర్యాదులు అందుతున్నాయన్నారు.

అమల్లోకొచ్చిన ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్

తాడిపత్రిటౌన్ : ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో సభలు, సమావేశాలపై నిషేధం విధించారు. పట్టణ ప్రధాన కూడళ్లలోని రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో రాజకీయనేతల పటాలను తొలగించారు.

వీఆర్వో కుటుంబానికి పరామర్శ

తాడిపత్రి టౌన్ : వెలంకూరు గ్రామానికి చెందిన వీఆర్వో కిరణ్‌కుమార్ కుటుంబాన్ని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య శుక్రవారం పరామర్శించారు. పెద్దపప్పూరు మండలం ముచ్చుకోట సచివాలయ వీఆర్‌ఓగా పనిచేస్తున్న కిరణ్‌కుమార్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు.

పండ్లు,కూరగాయల కలెక్షన్ సెంటర్ ప్రారంభం



కలెక్షన్ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే వైవీఆర్

పామిడి: గార్లదిన్నె హైవేలో వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు, కత్రిమలవాసి పెమ్మక రమణారెడ్డి ఏర్పాటు చేసిన ఫ్రూట్స్ అండ్ వెజిటబుల్ కలెక్షన్ సెంటర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి ప్రారంభించారు. పామిడి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్.మధుసూదన్‌రెడ్డి, రూరల్ బూత్ కన్వీనర్ ఆర్‌సీ వెంకట్రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: ఇంజినీరింగ్ విద్యార్థులకు చదువుతో పాటు పోషకాహారం అవసరం ఎంతైనా ఉందని యువజన సేవలు, నీటి నిర్వహణ రోటరీ ఇంటర్నేషనల్ చైర్మన్ శాంత రాజ్ పేర్కొన్నారు. శుక్రవారం రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో ప్రపంచ పప్పుదినుసుల దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. శాంతారాజ్ మాట్లాడుతూ విద్యార్థులు పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. ఆహార భద్రత, పోషకాహారం ఆహార ఉత్పత్తిలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి చైతన్య కిశోర్, టీపీఓ రంజిత్ రెడ్డి, రోటరాక్ట్ క్లబ్ సలహాదారు వెంకటసునీల్, డాక్టర్ సుమన గోపిచంద్, డాక్టర్ ప్రత్యూష, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన



కేవీఎల్‌పీ స్కూల్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గుంతకల్లు/గుంతకల్లు టౌన్: మార్చి 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం ఆర్డీఓ రవీంద్ర నేతృత్వంలో పలు పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ బండిశేషన్న, డీఎస్పీ నరసింగప్పతో కలిసి సత్యనారాయణపేటలోని సర్వేపల్లి రాధాకృష్ణన్ మున్సిపల్ హైస్కూల్, కందుకూరి వీరేలింగం పంతులు మున్సిపల్ స్కూల్‌లోని (68–78)లో ఏర్పాటు చేయనున్న పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ సువర్ణ, మున్సిపల్ రెవెన్యూ సిబ్బంది శిరీష, బీఎల్ఓ త్రివేణి పాల్గొన్నారు.

పుట్లూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం తహసీల్దార్ విజయకుమారి పరిశీలించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పోలింగ్ బూత్‌ల వద్ద సౌకర్యాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యోగానందరెడ్డి, ఎస్ఐ వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్నికల నియమాలను పాటించాలి

పెద్దవడుగూరు : ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ అనుసరించాలని తహసీల్దార్ ఈరమ్మ, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి తెలిపారు. శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన పోస్టర్లను తొలగించాలని సూచించారు. వైఎస్సార్ విగ్రహానికి ముసుగు వేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ భేష్

• ఐసీడీఎస్ రాష్ట్ర డైరెక్టర్ సిరి



జూటూరు కాలనీ - 2 లో చిన్నారులతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ రాష్ట్ర డైరెక్టర్ సిరి

తాడిపత్రి: తాడిపత్రి సెక్టార్ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై ఐసీడీఎస్ రాష్ట్ర డైరెక్టర్ సిరి సంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం ఆమె తాడిపత్రిలోని జూటూరు కాలనీ– 2 అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల హాజరు పట్టికను పరిశీలించారు. కేంద్రానికి అందుతున్న పౌష్టికాహార రికార్డులతో పాటు అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న స్టాకు రిజిష్టర్లను పరిశీలించారు. కేంద్రంలో ఉన్న చిన్నారులతో మాట్లాడారు. అనంతరం ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో విలేకరులతో మాట్లాడారు. సిబ్బంది విధులకు సక్రమంగా హాజరుకావాలన్నారు.కొందరు సూపర్‌వైజర్లు కార్యకర్తలను టార్గెట్ చేస్తూ వేధిస్తున్నారని విలేకరులు అడగ్గా, ఆధారాలుంటే విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ మునివేలు, సీడీపీఓ షాజిదా బేగం, సూపర్‌వైజర్లు దస్తగిరమ్మ, కల్పన, బ్లాక్ కోఆర్డినేటర్ అసిస్టెంట్ పల్లవి, సూపర్‌వైజర్లు, జూటూరు కాలనీ–2 అంగన్‌వాడీ కార్యకర్త ముంతాజ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల బలోపేతానికి కృషి చేయాలి

పెద్దపప్పూరు: ప్రభుత్వం అంగన్‌వాడీల బలోపేతానికి ఎంతో కృషి చేస్తోందని, పౌష్టికాహారం ప్రతి ఒక్కరికీ చేరాలని ఐసీడీఎస్ రాష్ట్ర డైరెక్టర్ సిరి సిబ్బందికి సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులను సొంతబిడ్డల్లా చూసుకోవాలన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని వరదాయపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. అనంతరం కాసేపు చిన్నారులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, సీడీపీఓ సాదితాబేగం, సూపర్ వైజర్ దస్తగిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

తాడిపత్రి డివిజన్

9912220722, 9010223701

9912220732, 9010588846





